క్లుప్తంగా

హంస వాహనంపై రఘునాయకుడు



నాగులుప్పలపాడు: ప్రసిద్ధి గాంచిన చదలవాడ రఘునాయక స్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా స్వామి వారు హంస వాహనంపై ఊరేగారు. గురువారం ఆలయ ఈవో అనీల్ పర్యవేక్షణలో స్వామి వారికి అలంకరణ చేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఈఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం హరిశ్చంద్ర నాటకం ఆకట్టుకుంది. హంస వాహనానికి ఉభయదాతలుగా నల్లూరి శ్రీరామూర్తి స్వామి వారికి ఉభయం అందజేశారు.

12న సామాజిక ప్రజావేదిక

సంతనూతలపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఈ నెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సామాజిక ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ రంగాల్లో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద చేసిన అభివృద్ధి పనులపై సోషల్ ఆడిట్ బృందం ఆయా గ్రామాల వారీగా తనిఖీలు చేసి గ్రామ సభలు నిర్వహించింది. ఇందులో భాగంగా ముగింపుగా ఈ నెల 12వ తేదీ మండల స్థాయిలో సామాజిక ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సురేష్‌బాబు వెల్లడించారు. ఈ సమావేశానికి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది హాజరుకావాలని కోరారు.

నేడు ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

మద్దిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో 2023–24 సంవత్సరం నిర్వహించిన ఉపాధి హామీ పనులపై (సోషల్ ఆడిట్) పబ్లిక్ ఫోరం 11వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

మహిళా పీఎస్ డీఎస్పీగా రమణకుమార్

ఒంగోలు టౌన్: పలువురు డీఎస్పీలకు పోస్టింగు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒంగోలు మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీగా వీవీ రమణకుమార్‌కు పోస్టింగ్ ఇచ్చారు. ప్రస్తుతం ఆయన వెయిటింగ్‌లో ఉన్నారు. పీటీసీ డీఎస్పీగా బాల సుందరరావు, అసిస్టెంట్ కమాండెంట్ 7వ బెటాలియన్ ఏపీఎస్పీ డీఎస్పీగా టీ శ్రీనివాసులును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యుత్ బకాయిలపై ప్రత్యేక చర్యలు

నాగులుప్పలపాడు: చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బిల్లులపై సిబ్బంది ప్రత్యేక చొరవతో వసూలు చేయాలని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యుత్ సమస్యలు, బకాయిలపై గురువారం నాగులుప్పలపాడులోని విద్యుత్ కార్యాలయంలో సిబ్బందితో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్‌శాఖ ప్రకటించిన 50 శాతం తగ్గింపుతో కూడిన అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్తీ బిజిలీ యోజన కింద ప్రకటించిన సోలార్ రూఫ్ టాప్ పథక ఉపయోగాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఈ శ్రీకాంత్, ఏఈ రమేష్ బాబు సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీపీ కార్యకర్తపై చర్యలు తీసుకోవాలి

సంతనూతలపాడు: వైఎస్సార్ సీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐటీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌పై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రకాశం జిల్లా వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ గురువారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటువంటి జుగుప్సకరమైన వ్యాఖ్యలు చేసే వారిని చట్ట పరంగా కఠినమైన శిక్షలు అమలు చేసి, పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

కౌలు రైతుకు.. భూధార్ గండి !

- కౌలు రైతుల పాలిట శాపంగా భూధార్
- డీకే పట్టాదారుల వివరాలు ఫార్మర్ రిజిస్ట్రీలో కనిపించని వైనం
- పథకాల లబ్ధి, రుణాలన్నీ భూ యాజమానులకే
- చీమకుర్తి మండలంలో 1300 మంది కౌలు రైతులు



చీమకుర్తి మండలంలో రైతు విశిష్ట గుర్తింపు నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది (ఫైల్)

చీమకుర్తి రూరల్: ప్రజలకు ఆధార్ కార్డు గుర్తింపు ఎంత అవసరమో రైతులకు కూడా గుర్తింపు కార్డు అవసరమని కేంద్రం ప్రభుత్వం ఇటీవలే 'భూధార్' కార్డులు జారీ చేసింది. వ్యవసాయం చేసే రైతుల గుర్తింపునకు కేంద్ర సర్కారు ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన భూధార్ కార్డులు ఇప్పటి వరకు కౌలు రైతులకు నామమాత్రంగానైనా ఇస్తున్నా అవి వారి గుర్తింపునకు గండి కొట్టనున్నాయి. సొంత భూమి అని ధ్రువీకరించే అధీకృత రికార్డులు కలిగిన రైతులకు మాత్రమే 'భూధార్' ఐడీలు జారీ చేస్తున్నారు. పీఎం కిసాన్, ఫసల్ బీమా వంటి ప్రభుత్వ పథకాలతో పాటు బ్యాంక్ రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డుల వంటి పరపతి సౌకర్యాలకూ భూధార్ తప్పనిసరని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ పరిణామంతో కౌలు రైతుల గుర్తింపు, పంట రుణాల సమస్య మొదటికొచ్చింది.

1300 మంది కౌలు రైతుల పరిస్థితి ఏంటి..

చీమకుర్తి మండలంలో 1300 మందికి పైగా కౌలు రైతులు ఉన్నారు. భూ యాజమానులకు ఇచ్చే భూధార్ కౌలు రైతులు పాలిట శాపంగా మారనుంది. దీనితో కౌలు రైతులకు, డీకే పట్టదారులకు తీరని నష్టం వాటిల్లింది. ఇప్పటివరకు వాస్తవ సాగుదారులు సంక్షేమం కోసం రాష్ట్రం చేసిన చట్టాలు నిర్వీర్యమవుతాయన్న అనుమానం కౌలుదారుల్లో నెలకొంది. ఈ చట్టాల వల్ల నామమాత్రంగా దక్కుతున్న గుర్తింపును ఈ భూధార్ కార్డులు మరింత గండి కొట్టనున్నాయి.

కౌలు రైతుల గగ్గోలు..

సొంత భూమి గల భూ యాజమానులకు 11 అంకెల గల విశిష్ట సంఖ్యను భూధార్ కార్డులను జారీ చేయాలని కేంద్రం ఆదేశించడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాలపై అమలు చేసింది. ఈ కార్డులను పీఎం కిసాన్, ఫసల్ బీమా వంటి ప్రభుత్వ పథకాలతో పాటు బ్యాంకు రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డుల వంటి సౌకర్యాలకు భూధార్ తప్పనిసరంటూ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. అయితే కౌలు రైతుల గుర్తింపు, పంట రుణాల సమస్య మొదటికి రానుంది. ప్రభుత్వం వివిధ చట్టాలు, పద్ధతుల ద్వారా అరకొరగా బ్యాంకు రుణాలు అందిస్తున్నాయి. ఈ చట్టాలను మరింత సరళతరం చేసి బ్యాంకు రుణాలు ఇవ్వాలని కౌలు రైతులు ఆందోళన చేస్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం భూధార్ వల్ల కౌలు రైతులు తీరని నష్టాన్ని తెచ్చి పెడుతున్నాయని కౌలు రైతు సంఘాలు గగ్గోలు పెడుతున్నాయి. భవిష్యత్‌లో భూధార్ కలిగిన రైతులకు పంట రుణాలు, పీఎం కిసాన్, బీమా సదుపాయాలు పేర్కొనడంతో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న చట్టాలతో జారీ చేసిన కౌలు రైతుదారుల గుర్తింపు కార్డుల చెల్లుబాటు ప్రశ్నార్థకంగా మారనుందని వాపోతున్నారు.

భూధార్ ఉంటేనే బ్యాంకుల్లో రుణాలు..

భవిష్యత్‌లో భూధార్ ఉంటేనే బ్యాంకుల్లో రుణాలిస్తారని రిజర్వ్ బ్యాంకులకు ఆదేశిలిచ్చింది. గతంలో కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు చట్టం మేరకు ఇచ్చిన కౌలు రైతు కార్డులకు అరకొరగా రుణాలిచ్చే బ్యాంకులు ఆర్బీఐ ఆదేశాలతో వారికి రుణాలు అందని ద్రాక్షగా మారనున్నాయి. కూటమి సర్కార్ కౌలు రైతులకు మేలు చేసేలా చట్టం తీసుకుని వస్తానని పేర్కొంది. ఆ చట్టం కోసం కౌలు రైతులు ఎదురు చూస్తున్నారు.

> **కౌలు రైతులకు తీరని నష్టం..**
>
> 
>
> వాస్తవంగా 70 నుంచి 80 శాతం మంది కౌలు రైతులే పంట సాగు చేస్తున్నారు. ఈ తరుణంలో భూ యాజమానికి విశిష్ట సంఖ్యను జారీ చేస్తున్నారు. రాష్ట్రంలోని ప్రత్యేక పరిస్థితుల రీత్యా కౌలు రైతులకు ఏ విధంగా అమలు చేస్తారన్నది స్పష్టత ఇవ్వలేదు. దీంతో కౌలు రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల డిజిటల్ అగ్రిమిషన్‌ను ఏపీలో అమలు చేసేందుకు శర వేగంతో చేపట్టడం సరైన నిర్ణయం కాదు.
>
> – జడ రాజు, చీమలమర్రి

> **ఆందోళనలో డీకే పట్టాదారులు..**
>
> 
>
> డీకే పట్టదారులు ఫార్మర్ రిజిస్టర్ నమోదు కోసం రైతు సేవా కేంద్రం వెళ్లి వ్యవసాయ సహాయక అధికారులను ఫార్మర్ రిజిస్ట్రీ చేయమని అడగగా డీకే పట్టదారులకు నమోదు కావడం లేదు. డీకే పట్టదారుల సమాచారం వెబ్‌సైట్‌లో అందుబాటులో లేదు. దీంతో కౌలు రైతులు ఆందోళనలో ఉన్నారు.
>
> – బొద్దు కోటేశ్వరరావు
> ముప్పవారిపాలెం

టీడీపీ నాయకుల కనుసన్నల్లో వ్యభిచార గృహాలు

- పోలీసుల అదుపులో ఐదుగురు మహిళలు, ఇద్దరు విటులు

ఒంగోలు టౌన్: నగర శివారులోని రాజీవ్ కాలనీలో వ్యభిచార గృహాలపై పట్టపగలు పోలీసులు దాడి చేయడం కలకలం సృష్టించింది. తాలూకా సీఐ అజయ్‌కుమార్ సిబ్బందితో నిర్వహించిన దాడిలో ఐదుగురు మహిళలతో పాటుగా ఇద్దరు విటులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాజీవ్ నగర్‌లోని రెండు ఇళ్లపై దాడులు నిర్వహించారు. ఒక ఇంటిలో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు, మరో ఇంటిలో ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు రాగానే అప్రమత్తమైన కొందరు మహిళలు పారిపోయారు. నగర శివారులోని హైవే కు పక్కనే ఉన్న రాజీవ్ నగర్ మొదటి లైనులో గత కొంతకాలంగా యథేచ్ఛగా వ్యభిచారం జరుగుతుందని స్థానికులు చెప్తున్నారు. సుమారు 6 ఇళ్లలో పగలు రాత్రి తేడాలేకుండా వ్యభిచారం జరుగుతుందని, ఈ ఇళ్లకు ఎదురుగా ఖాళీ స్థలం ఉండటంతో అక్కడ వాహనాలను నిలబెడుతున్నారని స్థానికులు తెలిపారు. రాత్రి 7 గంటల తరువాత స్థానిక మహిళలు, చిన్నారులు బయటకు రావడానికి జంకుతున్నామని కాలనీవాసులు వాపోయారు. రెండు రోజుల క్రితం ఒక బెంజ్ కారులో ఏకంగా 8 మంది వచ్చారని, వారిలో 5 మంది పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నారని తెలిపా. ఇదిలావుండగా తెలుగుదేశం పార్టీకి చెందిన బూత్ ఇన్‌చార్జి ఒకరు, మరో డివిజన్ అధ్యక్షుడి కనుసన్నల్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దాంతో పోలీసులు స్పందించడంలేదంటున్నారు.

పోలీసులకు సమాచారం అందించినా..

ఇప్పటి వరకు సుమారు వందసార్లయినా పోలీసులకు ఫోన్లు చేసి వుంటామని, ఏదో ఒక సాకులు చెప్పి తప్పించుకుంటున్నారని ఒక మహిళ చెప్పారు. ఇక తప్పని పరిస్థితుల్లో డీఎస్పీకి ఫోన్ చేసి చెప్పడంతో పోలీసులు రంగంలోకి దిగినట్లు ఆమె తెలిపారు. కాగా రాజీవ్ కాలనీలోనే అర్బన్ హాస్పిటల్ సమీపంలో కూడా ఒక ఇంటిలో వ్యభిచారం జరుగుతుందని, అయినప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వ్యభిచార గృహాల్లో ఎక్కువగా మైనర్‌లు న్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని, రాజీవ్ కాలనీలో వ్యభిచారం జరగకుండా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

దోమల నివారణకు ప్రజలు సహకరించాలి



దోమ లార్వాలను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి



శాంపిల్‌లో కనిపిస్తున్న దోమ లార్వాలు

- జిల్లా మలేరియా నివారణ అధికారి మధుసూదన్‌రావు

మద్దిపాడు: దోమల నివారణకు ప్రజలు సహకరించి తమ వంతు కృషి చేయాలని జిల్లా మలేరియా నివారణాధికారి జీ మధుసూదనరావు అన్నారు. గురువారం ఆయన మండలంలోని గాజులపాలెం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బందికి ప్రజలు సహకరిస్తేనే దోమల నివారణ సాధ్యమవుతుందన్నారు. కాలువల్లో ముగురు నీరు బయటకు వెళ్లకుండా అడ్డుకట్టలు వేసుకోవడం వలన దోమలు ఉత్పత్తి అవుతాయన్నారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా ప్రకటించినా ఎక్కువ శాతం పాటించటం లేదన్నారు. దోమ సగటున ఒక్కసారికి 300 గుడ్ల వరకు పెడుతుందని.. ఒకేసారి అన్ని గుడ్లు తగిలి లార్వాలు బయటకు వస్తాయన్నారు. మూడు రోజుల వ్యవధిలో అవి దోమలుగా మారిపోతాయన్నారు. అందుకే ప్రతి శుక్రవారం ఇళ్లల్లో నీరు నిల్వ ఉండకుండా పాత్రలు, తొట్లు శుభ్రం చేసుకోవాలని ఆయన ప్రజలను కోరారు. ఆయన వెంట సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, వెంకా రెడ్డి, పీహెచ్‌సీ సూపర్వైజర్ సూపర్వైజర్ బాలకోటయ్య, ఎమ్ ఎల్ హెచ్‌పీ, ఏఎన్ఎం వైద్య శాఖ సిబ్బంది స్థానిక ప్రజలు పలువురు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



బండ్లమూడిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



కార్యక్రమంలో సూచనలు అందిస్తున్న సిబ్బంది

నాగులుప్పలపాడు: తల్లిపాలు బిడ్డకు ఎంతో మేలు చేస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి అన్నారు. గురువారం మండలంలోని ఉప్పుగుండూరులో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ శ్రీదేవి, ఉషారాణి మాట్లాడుతూ పోషణ్ పక్వాడా కార్యక్రమం ఈ నెల 8 నుంచి 22వ తేది వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో 1000 రోజుల సంరక్షణ, ఆహార వైవిధ్యత, తల్లి పిల్లల గురించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బండ్లమూడిలో..

చీమకుర్తి రూరల్: ప్రతి తల్లి తన బిడ్డకు పుట్టినప్పటి నుంచి ఆరు నెలలు వరకు తల్లి పాలు పట్టించడం వలన చంటిబిడ్డ ఆరోగ్యం కరంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పిచ్చమ్మ అన్నారు. గురువారం బండ్లమూడి సచివాలయంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో ఇవాంజలిన్, దేవసేన, ప్రమీల అంగన్‌వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

నేటి నుంచి హరిహరక్షేత్ర వార్షిక వేడుకలు

చీమకుర్తి: చీమకుర్తిలోని హరిహరక్షేత్రం 19వ వార్షికోత్సవాలు శుక్రవారం నుంచి రెండు రోజులు పాటు జరగనున్నట్లు శిద్దా వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. హరిహరక్షేత్రంలోని సకల దేవతా మూర్తులకు ట్రస్ట్ నిర్వాహకులు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు ఆధ్వర్యంలో విశేష పూజలు, అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు, అభిమానులు వేడుకల్లో పాల్గొనాలని నిర్వాహకులు తెలిపారు.

నేడు మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి

ఒంగోలు వన్‌టౌన్: మహాత్మా జ్యోతిరావు పూలే 199 జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమశాఖ అధికారి అంజల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు కొత్త కూరగాయల మార్కెట్ సమీపంలోని పూలే విగ్రహానికి జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆధ్వర్యంలో పూల మాలలు వేస్తారని తెలిపారు. అనంతరం స్పందన సమావేశ మందిరంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

క్షేత్ర సందర్శనలతో విజ్ఞానం

ఒంగోలు సిటీ: క్షేత్ర సందర్శనలతో విద్యార్థులు మరింత విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని డీఎస్ ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ కళ్యాణి పేర్కొన్నారు. గురువారం కళాశాల వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు పరిశ్రమలపై ప్రత్యక్ష అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయి పర్యటన ఏర్పాటు చేశారు. విద్యార్థులు గుండ్లాపల్లిలోని గ్రానైట్ వర్క్స్ అనే పరిశ్రమను సందర్శించారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగం ఇన్‌చార్జి పి. కుసుమకుమారి, అధ్యాపకులు కే రాణి, ఎం. పద్మ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఒంగోలు బార్ అసోసియేషన్ ఎన్నికలు

ఒంగోలు: ఒంగోలు బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం జరగనున్నాయి. స్థానిక జిల్లా కోర్టు భవనాల సముదాయం ఆవరణలోని అసోసియేషన్ సమావేశ మందిరంలో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకుగాను ఇప్పటికే బ్యాలెట్ పేపర్లు సిద్ధం చేశారు. ఎన్నికల ప్రక్రియను ఎన్నికల అధికారి పీవీఎస్ గుప్తా పర్యవేక్షిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తారు. అనంతరం కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. మొత్తం 817 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, లేడీ రెప్రజెంటేటివ్ స్థానాలకు మాత్రమే ఎన్నికలు జరుగుతాయి. స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ స్థానానికి ఎవరు నామినేషన్ వేయలేదు. మిగిలిన కోశాధికారి, ప్రధాన కార్యదర్శి, గ్రంథాలయ కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి పోస్టులు ఏకగ్రీవం అయ్యాయి. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం కౌంటింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు.

సర్వత్రా ఉత్కంఠ..

అధ్యక్ష స్థానానికి ఎన్నడూ లేని విధంగా ఆరుగురు అభ్యర్థులు బరిలో ఉండటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. బొడ్డు భాస్కరరావు, చావలి రమేష్‌బాబు, గోకనకొండ శ్రీనివాసరావు, నాయుడు ఈశ్వరరావు, పీఎస్‌వీ సత్యనారాయణరెడ్డి, వేల్పుల తిరుమల కృష్ణ యాదవ్‌లు బరిలో ఉన్నారు. ఉపాధ్యక్ష స్థానానికి చుండూరి కృష్ణమూర్తి, మోటుమర్రి బలరాంలు పోటీలో ఉన్నారు. లేడీ రెప్రజెంటేటివ్ స్థానానికి ముద్ద హెలీనా దీపాలత, తోట రాగ సుధారాణిలలో గెలుపు ఎవరిదనేది చర్చనీయాంశంగా మారింది.

స్వచ్ఛభారత్‌తో గ్రామాల పరిశుభ్రం



గ్రామంలో పర్యటిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నిడమానూరి

ఒంగోలు సిటీ: స్వచ్ఛభారత్ కార్యక్రమంతో గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని భారతీయ జనతా పార్టీ ఏపీ కార్యవర్గ సభ్యుడు డాక్టర్ నిడమానూరి సూర్యకల్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. గురువారం 'పల్లెకు పోదాం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని సర్వేరెడ్డి పాలెంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటికి పరిష్కారాలు చూపుతానని హామీ ఇచ్చారు. అంతకు ముందు గ్రామంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఆలయాలు, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి ప్రాంగణాలను, రోడ్లు శుభ్రం చేశారు. అనంతరం చెరువును సందర్శించి పరిసరాలను శుభ్రం చేశారు. బూత్ కమిటీ నాయకులతో సమావేశం నిర్వహించారు. బీజేపీ కార్యకర్తల ఇళ్లకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పుచ్చకాయల సుబ్బారావు, మక్కెన శ్రీనివాసులు, మక్కెన వెంకట్రావు, పుచ్చకాయల శ్రీనివాసులు, ముప్పా సుధాకర్‌రావు, మందపల్లి వెంకటేశ్వర్లు, అప్పనబోయిన విష్ణుమూర్తి పాల్గొన్నారు.

ఆటల్లో గెలుపోటములు సహజం



క్రికెట్ ఆడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: ఆటల్లో పాల్గొనే క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. బాబా సాహెబ్ 134వ వర్ధంతి సందర్భంగా భీమ్ సేవా సమితి, భీమ్ ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ పోటీల కప్ ఆవిష్కరణకు గురువారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అంబేడ్కర్ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిషలు పాటుపడ్డారన్నారు. క్రీడలు మానసిక వికాసానికి దోహదపడుతాయని, శారీరకంగా ధృఢత్వాన్ని ఇస్తాయని చెప్పారు. కార్యక్రమంలో తాలుకా ఎస్ఐ అనిత, దాసరి కోటేశ్వరరావు, ఆదినారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయులకు శాశ్వత కౌన్సెలింగ్ నిర్వహించాలి

ఒంగోలు సిటీ: జీరో ఎన్‌రోల్ ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు శాశ్వతంగా కౌన్సెలింగ్ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లోకి సర్దుబాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వంలో విలీనమైన ఉపాధ్యాయులకు పూర్తి సర్వీస్ కేటాయించాలన్నారు. కంభం సత్యనారాయణ శ్రీనివాస ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే ఓ సూర్యనారాయణ పెండింగ్ జీతాల సమస్య పరిష్కరించాలన్నారు. కొమరోలు మండలం గోపానపల్లి ఏబీఎం ఎయిడెడ్ ఉపాధ్యాయుడు డీ ఆంజనేయులుకు ఇంక్రిమెంట్ల సమస్య పరిష్కరించాలన్నారు. చెరుకూరు ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే ఇద్దరు ఉపాధ్యాయుల 15 నెలల జీతాల సమస్య పరిష్కరించాలన్నారు. వివేకానంద ఓరియంటల్ ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే ఇద్దరు ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్ సమస్య పరిష్కరించాలన్నారు. ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే సంస్కృతం, తెలుగు, హిందీ, పీఈటీలకు పదోన్నతి కల్పించాలన్నారు. ఎయిడెడ్ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో సమానంగా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. పైసమస్యలను జిల్లా విద్యాశాఖ అధికారి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.